సాక్షి
నంద్యాల
శుక్రవారం, 5 ఏప్రిల్, 2024



అంగన్‌వాడీ పనివేళల మార్పు

తుగ్గలి: అంగన్‌వాడీ కేంద్రాల పనివేళలను రాష్ట్ర ప్రభుత్వం మార్పు చేసింది. గురువారం నుంచి మే 31 వరకు ఉదయం 8 నుంచి మధ్యా హ్నం 12 గంటల వరకు కేంద్రాలు పనిచేయనున్నాయి.



అలరించిన నృత్య ప్రదర్శనలు

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పుర స్కరించుకుని భక్తుల సౌకర్యార్థం శ్రీశైలంలోని నిత్యకళావేదికపై ఏర్పాటు చేసిన నృత్య ప్రద ర్శనలు అలరించాయి.



పాలిటెక్నిక్.. భవితకు భరోసా

'పాలిసెట్' ఏప్రిల్ 27వ తేదీన నిర్వహించను న్నారు. ఇప్పటికే 3 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. శుక్రవారంతో గడువు ముగియనుంది.

IIలో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:44
ఆదోని	సా॥ 6:38	ఉ॥ 4:47
నంద్యాల	సా॥ 6:35	ఉ॥ 4:41
ఆత్మకూరు	సా॥ 6:33	ఉ॥ 4:42
బనగానపల్లె	సా॥ 6:36	ఉ॥ 4:42

హదీస్ వెలుగు :

మంచి పనులు చేస్తున్నప్పుడు ఒకరికి చూపాల్సిన అవసరం లేదు. చెడు చేస్తున్నప్పుడు ఎవరూ చూడటం లేదు అని కాదు.. సృష్టికర్త అల్లాహ్ అన్నీ చూస్తున్నారు. - పవిత్ర ఖురాన్

తప్పులో కాలేసి.. నిరసనలు ఎగసి!



తెలుగుదేశం పార్టీలో నిరసన జ్వాలలు చల్లారట్లేదు. పార్టీ కోసం సుదీర్ఘంగా శ్రమించి సార్వత్రిక బరిలో నిలవాలని ఆశించిన ఇన్‌చార్జీలను కాదని, ఇతరులకు టిక్కెట్ కేటాయించడంతో ఆపార్టీ అధిష్టానంపై తిరుగుబాటు కొనసాగుతోంది. టీడీపీ ప్రకటించిన అభ్యర్థులకు ఏమాత్రం సహకరించకుండా పూర్తిగా ఎన్నికల తతంగానికి దూరంగా ఉంటున్నారు. టిక్కెట్ ప్రకటించిన ప్రస్తుత అభ్యర్థుల కంటే, ఇన్‌చార్జీలే కాస్త బలంగా ఉండటం, పార్టీ కేడర్ వారితోనే ఉండటంతో తాజా అభ్యర్థుల గెలుపు కష్టమనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. ఎన్నికలు చేసుకునే సత్తా లేనప్పుడు టిక్కెట్ ఎందుకు ఆశించారంటూ అధిష్టానం కూడా అభ్యర్థులపై మండిపడినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో మంత్రాలయం, నందికొట్కూరు అభ్యర్థులను మార్చే యోచనలో ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

తమ్ముళ్ల తలోదారి!

- ఇన్‌చార్జీలను కాదని ఇతరులకు టిక్కెట్లు
- ఆదోని, ఆలూరు, మంత్రాలయం, కోడుమూరు, నంద్యాల, డోన్‌లో చుక్కెదురు
- ప్రచారానికి దూరంగా పాత కాపులు
- టీడీపీ ప్రకటించిన అభ్యర్థులకు సహకారం ససేమిరా
- కొందరు ఇండిపెండెంట్‌గా పోటీకి ఆసక్తి
- మంత్రాలయం, నందికొట్కూరులో మళ్లీ అభ్యర్థుల మార్పు?



సాక్షి ప్రతినిధి కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ ఆరుగురు ఇన్‌చార్జీలను పక్కనపెట్టి ఇతరులకు టిక్కెట్లు కేటాయించింది. కర్నూలు జిల్లాలో 7 స్థానాల్లో నలుగురిని, నంద్యాల జిల్లాలో ఇద్దరిని మార్పు చేసింది. ఈ విషయమై టిక్కెట్లు ప్రకటించిన రోజు నుంచి ఆ పార్టీలో ఏదో ఒక చోట అసమ్మతి రగులుతూనే ఉంది. ఆదోనిలో పార్టీ ఆవిర్భావం నుంచి మీనాక్షి నాయుడు టీడీపీ ఉన్నతికి పాటుపడ్డారు. ఆర్థికంగా బలంగా లేరనే కారణంతో ఆయనకు టిక్కెట్ నిరాకరించారు. పొత్తులో భాగంగా బీజేపీకి టిక్కెట్ కేటాయించారు. ఆ పార్టీ తరఫున డాక్టర్ పార్థసారథి టిక్కెట్ దక్కించుకున్నారు. ఇక్కడ మీనాక్షి నాయుడు బరిలో ఉంటనే గెలుపు అవకాశాలు అంతంతమాత్రం. అలాంటిది ఆదోనిలో 2 శాతం ఓట్లు కూడా లేని బీజేపీ బరిలో ఉంటే గెలుపు అవకాశాలు ఎలా ఉంటాయో ఇట్టే తెలుస్తోంది. పైగా మీనాక్షినాయుడు మద్దతు లేకుండా టీడీపీ ఓట్లు బీజేపీకి బదిలీ అయ్యే అవకాశం లేదు. కమలం పార్టీకి మద్దతు పలికేందుకు ఆయన ససేమిరా అంటున్నారు. పైగా ఈ టిక్కెట్టును వదులుకునేందుకు రూ.3కోట్లకు బీజేపీ బేరం పెట్టడం తెలిసిందే. దీంతో తాను లేదా తనయుడు భూపాల్ నాయుడును ఇండిపెండెంట్‌గా బరిలోకి దింపే యోచనలో మీనాక్షినాయుడు ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన అనుచరులు, టీడీపీ శ్రేణులు కూడా పోటీలో ఉండాలని పట్టుబడుతుండటం గమనార్హం.

ఆలూరు వంక చూడని కోట్ల సుజాతమ్మ

ఆలూరు ఇన్‌చార్జ్‌గా కోట్ల సుజాతమ్మ కొనసాగుతున్నారు. కుటుంబానికి ఒకే సీటు అంటూ ఆమెను చంద్రబాబు పక్కనపెట్టారు. ఇటీవల టీడీపీలో చేరిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన భార్య ప్రశాంతి, అచ్చెంనాయుడు, రామ్మోహన్‌నాయుడు, ఆదిరెడ్డి వాసు, చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ.. ఇలా చాలా చోట్ల రెండు, మూడేసి సీట్లు ఇచ్చారు. కోట్ల కుటుంబం రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సేవలందించింది. ఇలాంటిది తమను ఈ నిబంధనతో పక్కన పెట్టడం ఏంటని సుజాతమ్మ గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. 'మీరే రాజకీయాలు చేసుకోండి. నేను ఎక్కడికీ రాను' అంటూ గట్టిగానే టీడీపీ నేతలకు చెప్పినట్లు సమాచారం. అయితే కాంగ్రెస్, టీడీపీల నుంచి 2014, 2019లో కోట్ల కుటుంబం ఘోరంగా ఓడిపోయింది. దీంతో కోట్ల కుటుంబ ప్రభావం తగ్గిందనే కారణంతోనే చంద్రబాబు టిక్కెట్ నిరాకరించారనే చర్చ ఆ పార్టీలో కొనసాగుతోంది. సుజాతమ్మ మద్దతు లేకుండా టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ గెలవడం కష్టమే. పైగా గుమ్మనూరు జయరాం సిఫార్సుతో గౌడ్ టిక్కెట్ దక్కించుకున్నారు. దీంతో ఆయనను జయరామే చేసుకుంటాడు, తనకెందుకు అనే ధోరణిలో సుజాతమ్మ ఉన్నట్లు తెలుస్తోంది.

కోడుమూరులో తెగని పంచాయితీ

కోడుమూరులో ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి వర్గాల మధ్య టిక్కెట్ పంచాయతీ తెగలేదు. విష్ణు ప్రతిపాదించిన బొగ్గుల దస్తగిరి అభ్యర్థిత్వాన్ని కోట్ల వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఆకేపోగు ప్రభాకర్‌కు టిక్కెట్ ఇవ్వాల్సిందేనని, లేదంటే టీడీపీకి పని చేసే ప్రసక్తే లేదనే ధోరణిలో ఉన్నారు. టిక్కెట్ ఇవ్వకపోతే ప్రభాకర్‌ను ఇండిపెండెంట్‌గా నిలిపేందుకు సిద్ధమయ్యారు. ఈక్రమంలో పలుమార్లు సమావేశాలు కూడా నిర్వహించారు. అయితే దస్తగిరిని మార్చే ప్రసక్తే లేదని టీడీపీ అధిష్టానం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. దీంతో పార్టీ మారాలా? లేదా ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలా? అనే ఆలోచనలో ప్రభాకర్ ఉన్నారు. దస్తగిరితో విష్ణు వ్యతిరేక టీడీపీ వర్గం ఎవ్వరు కూడా ప్రచారంలో పాల్గొనడం లేదు.

నంద్యాల, డోన్‌లోనూ అదే పరిస్థితి

డోన్ ఇన్‌చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డిని కాదని కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి టిక్కెట్ ఇవ్వడంతో కోట్ల, కేఈ కుటుంబాలపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మీసం తిప్పి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని ప్రకటించారు. అయితే వీరి మధ్య పార్టీ సయోధ్య కుదిర్చింది. అయితే సుబ్బారెడ్డి మాత్రం ఎన్నికల తంతులో పాల్గొనడం లేదు. నంద్యాలలో భూమా బ్రహ్మానందరెడ్డి పరిస్థితీ అంతే. 'ఫరూక్‌కు ఓటేసి, గెలిపించండి!' అనే మాట బ్రహ్మం నోటి నుంచి రావట్లేదు. 'టీడీపీలో ఉన్నాం.. పార్టీ కోసం చేస్తాం..' అనే ధోరణిలో ఉంటున్నారు. ఎక్కడా ఫరూక్‌తో కలిసి ప్రచారం చేయకపోవడం, లేదా చర్చించకపోవడంతో కేడర్‌లో గందరగోళం నెలకొంది.

ఆ రెండు టిక్కెట్లు మార్చే యోచనలో చంద్రబాబు

మంత్రాలయంలో రాఘవేంద్ర, నందికొట్కూరులో గిత్త జయసూర్య ఇద్దరూ ఎన్నికలు చేసుకోలేరని, టిక్కెట్ ప్రకటించిన తర్వాత ఈ రెండు నియోజకవర్గాల్లో పార్టీ మరింత బలహీనంగా ఉందని చంద్రబాబుకు నివేదికలు అందినట్లు తెలుస్తోంది. పైగా తిక్కారెడ్డి నిత్యం ఆందోళనలు చేస్తున్నారు. వాల్మీకి సామాజికవర్గం కూడా రాఘవేంద్రతో లేదు. వాల్మీకులు ఎక్కువగా ఉన్నారనే ఏకైక కారణంతోనే ఆయనకు టిక్కెట్ దక్కింది. ఇప్పుడు ఆశించిన స్థాయిలో పరిస్థితి లేదని.. బలహీనమైన అభ్యర్థితో ఎన్నికలకు వెళ్తున్నామని, కచ్చితంగా అభ్యర్థిని మార్చాలని రాబిన్‌శర్మ చంద్రబాబుకు రిపోర్ట్ ఇచ్చినట్లు సమాచారం. దీంతో గురువారం రాఘవేంద్రను కర్నూలుకు పిలిపించి టీడీపీ జోనల్ కో ఆర్డినేటర్ బీదా రవిచంద్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నందికొట్కూరులో జయసూర్యను కూడా మార్చాలని రాబిన్ శర్మ తన రిపోర్ట్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. త్వరలోనే వీరి స్థానంలో వేరే అభ్యర్థులుగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

న్యూస్‌రీల్

ఎన్నికల విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

ఆళ్లగడ్డ: ఎన్నికల విధుల్లో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు సూచించారు. స్థానిక నియోజకవర్గ ఎన్నికల కార్యాలయాన్ని (తహసీల్దార్ కార్యాలయం) గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆర్‌ఓ, ఏఆర్‌ఓ, ఓఎస్ టీం, ఎఫ్ఎస్టీ, వీవీటీ, ఎంసీసీ, ఆడిట్ టీంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు వ్యక్తిగత అభిమానం, అభిప్రాయాలను ప్రదర్శించకూడదన్నారు. స్వేచ్ఛగా, న్యాయంగా, శాంతియుతంగా, ప్రలోభాలకు అతీతంగా విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారి మల్లికార్జునరెడ్డి, డీఎస్పీ షర్ఫొద్దీన్, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నజీర్ అహమ్మద్, ఏవీ రమణమ్మ, నాగరాజు, మురళీమోహన్, మధురవాణి, వెంకటరమణ ఉన్నారు.

మహానందీశ్వరుడి దర్శన వేళల్లో మార్పులు

మహానంది: ఉగాది మహోత్సవాల సందర్భంగా మహానంది ఆలయానికి కన్నడ భక్తులు వేలాది సంఖ్యలో తరలివస్తున్న నేపథ్యంలో బుధవారం నుంచి ఈనెల 11వ తేదీ వరకు మహానందీశ్వరస్వామి దర్శన వేళల్లో మార్పులు చేస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వేకువజామున 3 గంటలకే ఆలయ తలుపులు తెరిచి అభిషేకాలు, అర్చనలు, అష్టవిధ మహామంగళ హారతులు నిర్వహిస్తామన్నారు. 4.30 నుంచి 6.30 గంటల వరకు ప్రత్యేక దర్శనాలు ఉంటాయన్నారు. ఇదే సమయంలో రూ.100 ఆర్జిత సేవాటికెట్లతో భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. కాగా కన్నడ భక్తులు ఎన్నో వ్యయప్రయాసలకు గుర్రై వస్తారని, ఆర్జిత సేవాటికెట్ ధర నిర్ణయంపై అధికారులు ఆలోచించాలని పలువురు భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తనిఖీ చేసిన నాక్ బృందం



అధ్యాపకులతో చర్చిస్తున్న నాక్ బృందం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం బెంగళూరు నుంచి వచ్చిన నాక్ బృందం సందర్శించింది. నాక్ చైర్మన్ డాక్టర్ శంకర్‌పటేల్, సభ్యులు డాక్టర్ బాలగోవిందన్ హరిహరన్, జోసెఫ్ కళాశాలను సందర్శించి అధ్యాపకులతో సమావేశమయ్యారు. బోధన, మౌలిక వసతులపై చర్చించారు. విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతరుల వివరాలను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శశికళను అడిగి తెలుసుకున్నారు.

పింఛన్ పంపిణీ 89.13 శాతం పూర్తి



పింఛన్ కోసం ఎదురు చూస్తున్న అవ్వాతాతలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఏప్రిల్ నెల పింఛన్ పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. పింఛన్ల పంపిణీ గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,22,938 పింఛన్లకు గానూ సాయంత్రానికి 1,98,713 మందికి(89.13 శాతం) పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 6వ తేదీ లోపు వంద శాతం పూర్తి చేస్తామన్నారు. మంచానికే పరిమితమైన వారికి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందజేస్తున్నట్లు తెలిపారు.

అంతిమ విజయం పేదలదే



కోర్టు తీర్పుతో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సంబరాలు చేసుకుంటున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

- కోర్టు తీర్పుతో 3,200 మంది పేదలకు దక్కనున్న ఇళ్ల పట్టాలు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: పట్టణంలోని ఇళ్ల పట్టాల పంపిణీ విషయంలో అంతిమ విజయం పేదలదేనని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. హైకోర్టు తీర్పు పేదలకు అనుకూలంగా రావడంతో గురువారం సాయంత్రం ఆయన తన స్వగృహంలో కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ హైకోర్టు తీర్పుతో సుమారు 3,200 మందికి ఇంటి పట్టాలు దక్కనున్నాయన్నారు. మరో రెండు నెలల తర్వాత తమ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, అప్పుడు అర్హులందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని చెప్పారు. 2019లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి పీఠం అధిష్టించిన వెంటనే కుల, మత, పార్టీలకు అతీతంగా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన 30 లక్షల మందికి ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. అందులో భాగంగానే పట్టణంలోని పేదలకు ఎస్‌ఆర్‌బీసీకి చెందిన ప్రభుత్వ మిగులు భూమిని సేకరించి పంపిణీకి సిద్ధం చేయగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి తన అనుచరులతో కోర్టులో కేసులు వేయించి అడ్డుకున్నారన్నారు. ఎట్టకేలకు కోర్టు తీర్పు ఇళ్ల పట్టాల పంపిణీకి అనుకూలంగా రావడంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌తో పాటు ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలకు పేదల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. మరో రెండు నెలల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, వీలైనంత త్వరగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని సోదరులు సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి, ముస్లిం మైనార్టీ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అత్తార్ జాహెద్ హుస్సేన్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, షేక్ ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, ఎవరెస్టు బాబు, నీలి శ్రీనివాసులు, సాదుల మురళీమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు యల్లయ్య, సురేష్, కంబగిరి, దేవుడు, కృష్ణారెడ్డి, కరీం, రోబో, బాలు, కూరగాయల రహిమాన్ పాల్గొన్నారు.

ఇకపై అన్ని వ్యాధులకు వైద్యం ఇక్కడే!

పూర్తిస్థాయిలో వైద్యసేవలకు సిద్ధమైన వందపడకల ఆస్పత్రి

- కార్పొరేట్ స్థాయిలో ఆస్పత్రి నిర్మాణం
- ఇకపై అన్ని వ్యాధులకు ఇక్కడే వైద్యం



వంద పడకల ప్రభుత్వాస్పత్రి

డోన్: పట్టణ శివారులోని గుత్తిరోడ్డు పక్కన అత్యాధునిక వసతులతో నిర్మించిన వంద పడకల ప్రభుత్వాసుపత్రి రోగులకు సేవలు అందించేందుకు సిద్ధమైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో రూ.40 కోట్లు వెచ్చించి నిర్మించిన ఆధునిక వసతుల వంద పడకల ఆస్పత్రికి 96 మంది వైద్యులు, ఇతర సిబ్బందిని నియమించడంతో గురువారం నుంచి అన్ని వ్యాధులకు పూర్తిస్థాయిలో ఇక్కడే వైద్య సేవలు అందించనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ తెలిపారు. ఆర్థో, ఆప్తాలమిక్, ఈఎన్‌టీ, న్యూరాలజీ, యూరాలజీ, గైనిక్, చైల్డ్, డెంటల్ తదితర విభాగాలకు ప్రత్యేక వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. డోన్, పత్తికొండ, గుత్తి నియోజకవర్గాల ప్రజలకు ఈ ఆస్పత్రి సేవలందించనుందన్నారు. ప్రస్తుతం 400 నుంచి 500 దాకా ఓ.పి ఉందన్నారు. మరో నెలరోజుల్లో ఓ.పీ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.



క్యాజువాలిటీకి వెళ్లే దారి



సిద్ధంగా ఉన్న ల్యాబోరేటరీ

పూర్తిస్థాయిలో గైనిక్ సేవలు

ప్రభుత్వాసుపత్రిలో ఇకపై పూర్తిస్థాయిలో మాతా శిశు సంరక్షణకు అత్యవసర సేవలు అందుబాటులో ఉంటాయని సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ రమ్యశిల్ప తెలిపారు. నిపుణులైన వైద్యులతో పాటు 24 మంది స్టాఫ్ నర్సులు, నలుగురు హెడ్ నర్సులు, నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసినందువల్ల హైరిస్క్ ఆపరేషన్లు కూడా ఇక్కడ చేయనున్నట్లు చెప్పారు.



గైనిక్ వార్డులో వైద్యం కోసం వేచి ఉన్న గర్భిణులు



అందుబాటులోకి వైద్యులు



వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

రేపటి నుంచి శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు

- కన్నడ భక్తుల కోసం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు
- ప్రతిరోజు అమ్మవారికి విశేష అలంకారం, వాహనసేవలు
- భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం



శ్రీశైలంటెంపుల్: ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు శ్రీశైలమహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. కర్ణాటకతో పాటు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో శ్రీగిరి క్షేత్రం కిక్కిరిసింది. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. పోలీసు, అటవీ, వైద్యశాఖ అధికారులు సమన్వయంతో ఉత్సవాల ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పర్యవేక్షిస్తున్నారు.

➤ ఈ నెల 6న ఉదయం 8.45 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశంతో ఉగాది మహోత్సవాలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత వేద స్వస్తి, శివసంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, చండీశ్వరపూజ, కంకణపూజ, ఋత్విగ్వరణం, దీక్షా కంకణధారణ, అఖండదీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, మండపారాధన, రుద్రకలశస్థాపన తదితర పూజలు నిర్వహిస్తారు. భ్రమరాంబాదేవి ఆలయంలో విశేషకుంకుమార్చనలు, నవావరణార్చనలు, చండీహోమం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, నిత్య హవనములు జరిపిస్తారు.


➤ 7వ తేదీ నుంచి ప్రతిరోజు యాగశాలలో చండీశ్వరపూజ, మండపారాధన, పంచావరణార్చనలు, కలశార్చనలు, జపానుష్టానాలు, రుద్ర హోమం, చండీహోమం, భ్రమరాంబాదేవి ఆలయంలో నవావరణార్చనలు, కుంకుమార్చనలు చేస్తారు. ప్రతిరోజు రాత్రి 8 గంటలకు స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం అనంతరం ఏకాంత సేవ ఉంటుంది.

ఉత్సవాల్లో ముఖ్య కార్యక్రమాలు

➤ 6న భృంగివాహనసేవ, మహాలక్ష్మి అలంకారం
➤ 7న కైలాసవాహనసేవ,మహాదుర్గ అలంకారం
➤ 8న నందివాహనసేవ, మహాసరస్వతి అలంకారం, ప్రభోత్సం.
➤ 9న ఉగాది రోజు పంచాంగ శ్రవణం, రథోత్సవం, రమావాణిసేవిత రాజరాజేశ్వరి అలంకారం.
➤ 10న పూర్ణాహుతి, అశ్వవాహనసేవ భ్రమరాంబాదేవి నిజాలంకరణ

వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం

- 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు రేపటి నుంచి పరీక్షలు
- ఎమ్మార్సీలకు చేరిన ప్రశ్నాపత్రాలు



ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఈనెల 6 నుంచి వార్షిక పరీక్షలు(5ఏ2/సీబీఏ3) ప్రారంభం కానున్నాయి. అందుకు విద్యా శాఖ ఏర్పాట్లను సిద్ధం చేసింది. ప్రశ్నాప్రత్రాలు కూడా ఎమ్మార్సీలకు చేరాయి. సిలబస్ పూర్తి కావడంతో ఉపాధ్యాయులు విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 16వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు 19వ తేదీ పరీక్షలు జరుగుతాయి. వీరిలో 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ పరీక్షలు రాస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3 నుంచి 8వ తరగతి విద్యార్థులకు సీబీఏ విధానంలో, 9వ తరగతికి సీబీఎస్ఈ విధానంలో పరీక్షలు జరుగుతాయి. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మాత్రం పాత విధానంలోనే నిర్వహిస్తారు. జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పరిధిలో 2,68,592 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.



డోన్‌టౌన్: వీల్‌చైర్‌లో దివ్యాంగుడిని తీసుకొస్తున్న దృశ్యం



కోవెలకుంట్ల: చేతికర్రల సాయంతో సచివాలయానికి వచ్చిన వృద్ధులు



కర్నూలు: పింఛన్ తీసుకునేందుకు సహాయకులతో వచ్చిన వృద్ధులు



ఆలూరు రూరల్: ఆలూరు సచివాలయం-2 వద్ద పింఛన్ కోసం లబ్ధిదారుల నిరీక్షణ

బాబూ.. ఎంతపనిచేశావ్!

పింఛన్ల కోసం రెండో రోజు గురువారం కూడా వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సత్తువనంతా కూడదీసుకుని అడుగులో అడుగు వేసుకుంటూ.. ఎండలో సచివాలయాల వద్దకు అతికష్టమ్మీద చేరుకున్నారు. లబ్ధిదారులు ఎక్కువ సేపు నిరీక్షించకుండా సచివాలయ ఉద్యోగులు వెంటనే పింఛన్లు పంపిణీ చేశారు. కొన్ని చోట్ల ఇళ్లకే వెళ్లి నడవలేని వృద్ధులకు, మంచంలో ఉన్న దివ్యాంగులకు పింఛన్లు అందించారు. వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంచన్‌గా ఇంటి వద్దనే పింఛన్ ఇచ్చేవారని, టీడీపీ అధినేత తమకు ఈ కష్టాలు తెచ్చి పెట్టారని పింఛన్ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబుకు తమ ఉసురు తగులుతుందని వృద్ధులు, దివ్యాంగులు శాపనార్థాలు పెట్టారు. –సాక్షినెట్‌వర్క్



కౌతాళం: నదిచాగిలో వేచి ఉన్న మహిళలు



ఆదోని సెంట్రల్: వృద్ధురాలైన తల్లిని తీసుకుని వెళ్తున్న కుమార్తె



నంద్యాల అర్బన్: చాబోలులో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న సచివాలయ సిబ్బంది



సి.బెళగల్: క్రిష్ణదొడ్డిలో పింఛన్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు



నందవరం: నదికైరవాడిలో దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి



పాములపాడు: ఆధార్ కార్డులు వరుస క్రమంలో ఉంచిన దృశ్యం



పాములపాడు: పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు



కర్నూలు: బి.క్యాంప్‌లోని 57వ సచివాలయంలో పింఛన్ అందుకుంటున్న వృద్ధులు, వితంతువులు

పాలిటెక్నిక్.. భవితకు భరోసా

● నేటితో దరఖాస్తు గడువు పూర్తి

నంద్యాల(న్యూటౌన్): పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. పదవ తరగతి విద్యార్హతతో సాంకేతిక విద్యకు పునాది వేసే 'పాలిసెట్'కు ఫిబ్రవరి 20న నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్ష ద్వారా రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు లభిస్తాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువు శుక్రవారంతో ముగియనుండటంతో ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారుంటే త్వరపడాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఇప్పటికే జిల్లాలో 3 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

పరీక్ష ఇలా..

పాలిసెట్ ఎంట్రెన్స్ పదో తరగతి సిలబస్ ఆధారంగా గణితం 50, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 చొప్పున మొత్తం 120 మార్కులకు ఉంటుంది. ప్రవేశ పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.100, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.400 చెల్లించాల్సి ఉంది.



నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల

- పాలిసెట్ దరఖాస్తుకు చివరి తేదీ ఏప్రిల్ 5
- ప్రవేశ పరీక్ష తేదీ ఏప్రిల్ 27
- ఫలితాల వెల్లడి మే 25
- కౌన్సెలింగ్ ప్రారంభం జూన్ 4వ వారం

ఉద్యోగ అవకాశాలు ఎక్కువ



పాలిటెక్నిక్‌లో ఏ కోర్సు పూర్తి చేసినా ఉద్యోగం, ఉపాధి సులభంగా దొరుకుతుంది. కళాశాలల్లో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులు వచ్చి విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నారు. పాలిటెక్నిక్ కోర్సు చేయడానికి సుమారు మూడేళ్ల సమయం, కేవలం రూ.13 వేల వరకు మాత్రమే ఫీజు వగైరాల ద్వారా వ్యయం అవుతుంది. ఆ తర్వాత ఇంజినీరింగ్ చేయాలనుకునే వారు అందులో చేరవచ్చు. – శ్రీనివాసప్రసాద్, ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, నంద్యాల

హెచ్‌టీ పత్తి విత్తనాల కోసం ముమ్మరంగా తనిఖీలు

కర్నూలు(అగ్రికల్చర్): హెచ్‌టీ పత్తి విత్తనాలను పూర్తిగా ఏరివేసేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. హెర్బిసైడ్ టాలరెంట్ జన్యువు కలిగిన పత్తి విత్తనాలు కలుపు మందులను తట్టుకుంటాయి. హెచ్‌టీ పత్తిలో కలుపు మందులు పిచికారీ చేసినా పంటకు ఏమీ కాదు. హెచ్‌టీ పత్తి విత్తనాలు పర్యావరణానికి, జీవవైవిధ్యానికి హాని కలిగిస్తాయని నిర్ధారణ కావడంతో కేంద్రం హెచ్‌టీ పత్తి విత్తనాలకు అనుమతి ఇవ్వలేదు. 2024-25 వ్యవసాయ సీజన్ మొదలు కానుండటంతో ముందస్తుగా వ్యవసాయ శాఖ పత్తి సాగు ఎక్కువగా ఉన్న కర్నూలు జిల్లాకు ప్రత్యేక టీమ్ పంపిణీ తనిఖీలు చేపట్టింది. కర్నూలులోని వివిధ ప్రాసెసింగ్ ప్లాంట్లలో 50, కర్నూలు, ఎమ్మిగనూరుల్లో 26 శ్యాంపుల్ సేకరించి అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించింది. అయితే అన్ని రిపోర్టులు నెగిటివ్ వచ్చినట్లు తెలుస్తోంది. మరింత లోతుగా హెచ్‌టీ విత్తనాల కోసం గాలింపు చేపట్టేందుకు ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని వ్యవసాయ శాఖ జిల్లా యంత్రాంగానికి 526 హెచ్‌టీ టెస్టింగ్ స్ట్రిప్ కిట్‌లను సరఫరా చేసింది. వీటిని సబ్ డివిజన్‌ల వారిగా పంపిణీ చేస్తున్నారు. జిల్లా వ్యవసాయ యంత్రాంగం ప్రాసెసింగ్ యూనిట్లు, విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి శ్యాంపుల్ తీసి అక్కడికక్కడే పరీక్షలు నిర్వహిస్తారు. పాజిటివ్ వస్తే వెంటనే చర్యలు తీసుకుంటారు.

రెండు లారీల సీజ్

కర్నూలు (న్యూటౌన్): మిడుతూరు మండలంలోని నాగలూటి నుంచి కేరళకు అక్రమంగా నాపరాయిని రవాణా చేస్తున్న లారీని సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ గురువారం విలేకరులకు తెలిపారు. అలాగే మార్కాపురం నుంచి హైదరాబాద్‌కు గెలాక్సీ గ్రానైట్ స్లాబ్స్‌ను అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేశామన్నారు. నాపరాయి లారీని డోన్ చెక్ పోస్టులో ఉంచామన్నారు , గెలాక్సీ గ్రానైట్ స్లాబ్స్ లారీని నన్నూరు టోల్‌ప్లాజా వద్ద సీజ్ చేసి కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఉంచామన్నారు.

ప్రకృతి హితం.. రసాయనానికి దూరం

- జిల్లాలో తగ్గిన రసాయన ఎరువుల వాడకం
- ప్రకృతి వ్యవసాయానికి పెరుగుతున్న ఆదరణ
- మెరుగుపడుతున్న భూఆరోగ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయానికి ఆదరణ పెరుగుతుండటంతో రసాయన ఎరువుల వినియోగం క్రమంగా తగ్గుతోంది. 2022-23తో పోలిస్తే 2023-24లో 65,306 టన్నుల ఎరువుల వాడకం తగ్గింది. 2023-24లో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం వల్ల కూడా కొంత రసాయన ఎరువుల వినియోగం తగ్గినట్లు స్పష్టమవుతోంది. ప్రకృతి వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం ఉండదు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కెమికల్స్ అవశేషాలు లేని నాణ్యమైన పంటలు పండే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ప్రోత్సహిస్తూ.. ఆర్గానిక్ సర్టిఫికెట్స్ జారీ చేసే వ్యవస్థను కూడా తెచ్చింది. దీంతో రైతులు స్వచ్ఛందంగా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపుతున్నారు.

మిరప సాగు పెరిగినా..

జిల్లాలో 2022-23లో 1.26 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు కాగా... 2023-24లో 1.58 లక్షల ఎకరాలకు పెరిగింది. నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉండటంతో పత్తి కూడా అధిక విస్తీర్ణంలో సాగవుతోంది. బావులు, బోర్లు, ఇతర నీటి సదుపాయాల కింద కూరగాయల సాగు కూడా ఎక్కువగానే ఉంది. ఈ పంటలన్నింటికీ సహజంగా రసాయన ఎరువులు ఎక్కువగానే వినియోగిస్తారు. రసాయన ఎరువుల్లో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు ప్రధానమైనవి. అన్ని రకాల ఎరువుల వినియోగం తగ్గడాన్ని పరిశీలిస్తే రైతుల్లో మార్పు వస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రసాయన ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువులు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎరువు పేరు	2023-24లో వినియోగం (టన్నుల్లో)
యూరియా	56,469
డీఏపీ	1,61,31
ఎంఓపీ	1723
కాంప్లెక్స్	1,27,453
ఎస్ఎస్‌పీ	2547
ఇతర ఎరువులు	3370
జింక్	122
మొత్తం	2,07,815

పెట్టుబడిలేని వ్యవసాయానికి ఆదరణ

రసాయన ఎరువుల వినియోగంతో ఎన్నో అనర్థాలు ఉన్నాయనే విషయాన్ని రైతులు క్రమంగా గుర్తిస్తున్నారు. విచ్చలవిడిగా ఎరువుల వినియోగిస్తుండటం వల్ల రైతులపై పెట్టుబడి వ్యయం పెరిగిపోతోంది. ఇందువల్ల వ్యవసాయం గిట్టుబాటుకాని పరిస్థితి ఏర్పడింది. రసాయన ఎరువులు అడ్డుగోలుగా వినియోగిస్తుండటం వల్ల భూమి స్వభావం దెబ్బతింటూ చౌడుబారుతున్నాయి. పర్యావరణం కలుషితం అవుతోంది. పంట ఉత్పత్తుల్లో కెమికల్స్ అవశేషాలు ఉండటం వల్ల గిట్టుబాటు ధరలు లభించని పరిస్థితి ఏర్పడింది. కంపెనీలు రసాయన ఎరువుల ధరలను అడ్డుగోలుగా పెంచేస్తున్నాయి. ఒక్క యూరియా మినహా అన్ని రకాల ఎరువుల ధరలు అడ్డుగోలుగా పెరిగిపోయాయి. ఎరువుల వినియోగం తగ్గడానికి ధరలు కూడా ఒక కారణమనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఎక్కువ మోతాదులో ఎరువుల వాడకం వల్ల కలుగుతున్న అనర్థాలను గుర్తించిన రైతులు స్వచ్ఛందంగా పెట్టుబడిలేని వ్యవసాయంవైపు మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది.

తగ్గిన వాడకం..

జిల్లాలో 2021-22లో ఎరువుల వినియోగం 2,44,849 టన్నులు ఉంది. 2022-23లో ఖరీఫ్‌లో 1,71,575 టన్నులు, రబీ సీజన్‌లో 1,01,544 ప్రకారం 2,73,119 రసాయన ఎరువులు వినియోగించారు. 2023-24 సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్‌లలో మొత్తంగా 2,07,815 టన్నుల రసాయన ఎరువులు వినియోగించారు. 2021-22 సంవత్సరంతో పోలిస్తే 28,270 టన్నులు, 2022-23 సంవత్సరంతో పోలిస్తే 65,306 టన్నుల రసాయన ఎరువుల వాడకం తగ్గింది. కెమికల్స్ వాడకం తగ్గుతుండటం వల్ల భూమి ఆరోగ్యం మెరుగుపడుతోంది. 2024-25 సంవత్సరంలో 3 నుంచి 5 శాతం రసాయన ఎరువుల వాడకం తగ్గించే దిశగా వ్యవసాయ శాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

ముగిసిన ఇంటర్ మూల్యాంకనం

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ పరీక్షల మూల్యాంకనం గురువారంతో ముగిసింది. ఈ ప్రక్రియ గత 18న మొదలు కాగా.. అదే నెల 31వ తేదీకి ముగియాల్సి ఉంది. అయితే ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులు మూల్యాంకన కార్యక్రమానికి హాజరు కాలేదు. షోకాజ్ నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. ఆయా కాలేజీల యాజమాన్యాలతో మాట్లాడి అధ్యాపకులను బాధ్యతలు అప్పగించడంతో నాలుగు రోజులు ఆలస్యంగా మూల్యాంకనం పూర్తయ్యింది. చివరి రోజున ఫిజిక్స్ 2,356, గణితం 2,400, కెమిస్ట్రీ సబ్జెక్టుకు సంబంధించి 2,110 సమాధాన పత్రాలను మూల్యాంకనం చేశారు. పరీక్ష ఫలితాలు ఈ నెల 12వ తేదీలోపు విడుదల చేసేందుకు బోర్డు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

ఆర్‌యూ పరీక్షల విధానంలో మార్పులు తెస్తాం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం యూజీ, పీజీ పరీక్షల నిర్వహణ విధానంలో మార్పులు తీసుకొస్తామని వీసీ బి. సుధీర్ ప్రేమ్‌కుమార్ వెల్లడించారు. గురువారం వర్సిటీ సెనేట్ హాల్‌లో పరీక్షల నిర్వహణ, తీసుకొచ్చే రీఫార్మ్స్‌పై వివిధ విభాగాల్ హెడ్‌లు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఆయన సమావేశం నిర్వహించారు. డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్ ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు ఈనెల చివరలో వైవా నిర్వహిస్తామన్నారు. డిగ్రీ 2, 4 సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీలో 6వ సెమిస్టర్ థియరీ పరీక్షలను మే మొదటి వారంలో నిర్వహిస్తామన్నారు. పీజీ, ఇంజినీరింగ్ కోర్సుల అకడమిక్ క్యాలెండర్ షెడ్యూల్ ప్రకారం కొనసాగాలన్నారు.

ఎస్‌ఐపై సస్పెన్షన్ వేటు

కర్నూలు : విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి పీఎస్ ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో స్పందించి సరైన చర్యలు తీసుకోకపోవడంతో ఎస్‌ఐపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు డీఐజీ కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటనలో పేర్కొన్నారు. కడప జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎస్‌ఐ సునీల్ కుమార్ రెడ్డిని సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా పోలీసులు విధుల పట్ల అలసత్వం వహించడం, క్రమశిక్షణను ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీఐజీ విజయరావు హెచ్చరించారు.

అంజన్న ఆశీస్సులు అందుకుని ప్రచారం





గిడ్డాంజనేయస్వామి మూల విగ్రహం, స్వామి పాదుకలతో ప్రదక్షిణలు చేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

● కొనసాగుతున్న సెంటిమెంట్

మంత్రాలయం: ఎన్నికల్లో ఒక్కొక్కరికీ ఒక్కో సెంటిమెంట్ ఉంటుంది. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గ అభ్యర్థులు దశాబ్దాలుగా అంజన్న సన్నిధి నుంచే ప్రచారం ప్రారంభించడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. మాజీ ఎమ్మెల్యే దివంగత బీవీ మోహన్‌రెడ్డి 25 ఏళ్లకు పైగా ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా పని చేశారు. ఐదు పర్యాయాలు ఆయన ఈ ఆలయం నుంచే ప్రచారం మొదలు పెట్టారు. ప్రస్తుత ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సైతం నాలుగు పర్యాయాలు ఇక్కడి నుంచే ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కూడా అంజన్న సన్నిధిలో పూజలు చేసుకుని ప్రచారం చేస్తున్నారు. మూడు పర్యాయాలు గెలుపొంది హ్యాట్రిక్ సొంతం చేసుకున్నారు. టీడీపీ ఇన్‌చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి, ప్రస్తుత అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి ఇదే సెంటిమెంట్‌ను అనుసరించారు. ఇంతకు ఈ ఆలయం ఎక్కడుందంటే మంత్రాలయం నియోజకవర్గం పెద్దకడబూరు మండలంలోని తారాపురంలో ఉంది. పెద్దకడబూరు గ్రామం నుంచి 14 కి.మీ.దూరంలో ఉన్న తారాపురంలో గిడ్డాంజనేయస్వామి వెలిశారు. గిడ్డాంజనేయస్వామికి విశేష పూజలతోపాటు స్వామి వారి పాదుకలను శిరస్సున ఉంచుకుని ధ్వజస్తంభం చుట్టూర ప్రదక్షిణలు చేస్తారు. ఇలా చేస్తే విజయం తమను వరిస్తుందని అభ్యర్థుల ప్రగాఢ విశ్వాసం. గురువారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆచారంలో భాగంగా ఇక్కడి నుంచే ప్రచారానికి శ్రీకారం చుట్టారు.

ట్రాక్టర్ ఢీకొని కూలీ మృతి

చాగలమర్రి: ట్రాక్టర్ ఢీకొని నగళ్లపాడు గ్రామానికి చెందిన కూలీ డి.పెద్ద ఓబులేసు(35) మృతిచెందాడు. ఈ ఘటన గురువారం వైఎస్సార్ జిల్లా రాజుపాళెం మండలం కూలూరు సమీపంలో చోటుచేసుకుంది. రాజుపాళెం ఎస్‌ఐ పి.తులసీనాగప్రసాద్ తెలిపిన వివరాలు.. నగళ్లపాడు గ్రామానికి చెందిన పెద్ద ఓబులేసు అదే గ్రామానికి చెందిన చిన్నరాముడు ట్రాక్టర్‌కు మట్టి లోడ్ చేసేందుకు కూలీగా వెళ్లాడు. మట్టి లోడ్ చేస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి పెద్ద ఓబులేసును ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతిచెందాడు. మృతుడి భార్య నాగలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా ప్రమాదం చాగలమర్రి మండల పరిధిలో చోటుచేసుకున్నా.. ట్రాక్టర్ యజమాని పోలీసులతో బేరసారాలు మాట్లాడుకుని వైఎస్సార్ జిల్లా రాజుపాళెం పరిధిలో జరిగినట్లు కేసు నమోదు చేయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ త్వరగా పూర్తి చేయాలి

నంద్యాల(సిటీ): పట్టణంలోని 48 వార్డుల్లో జరుగుతున్న పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు త్వరగా అందించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని పలు వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పింఛన్ సొమ్ము కోసం లబ్ధిదారులు ఎక్కువ సేపు వేచి ఉండకుండా చూడాలని చెప్పారు. వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. సిబ్బంది వారితో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు.

చాగలమర్రి ఈఓగా ప్రకాశం



చాగలమర్రి: స్థానిక మేజర్ గ్రామ పంచాయితీ ఈఓగా ప్రకాశం గురువారం బాధ్యతలు స్వీకరించారు. బనగానపల్లె మండలం మీరాపురం గ్రామ పంచాయితీ గ్రేడ్–2 కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

నివాళి

నంద్యాల(న్యూటౌన్): సుగుణమ్మ మృతి సీపీఐకి తీరని లోటని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ప్రసాద్, శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని స్వామిరెడ్డి భవన సీపీఐ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శిగా, అంగన్‌వాడీ కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. డోన్‌లో అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. సుశీలమ్మ, సురేష్, అజీజ్‌బాషా, కరీముల్లా, మాబు, కరీమ్, రవీంద్ర, రంగారెడ్డి, బాలస్వామి ఉన్నారు.

అభ్యంతరకర పోస్టులు పెడితే కఠిన చర్యలు

రుద్రవరం: సోషల్ మీడియాలో ఇతరులకు ఇబ్బంది కలిగించేలా, అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారితో పాటు ఆ గ్రూపు అడ్మిన్లపై కఠిన చర్యలు తీసుకుంటామని శిరివెళ్ల సీఐ చంద్రబాబు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపు అడ్మిన్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రూపుల్లో కుల,మత రాజకీయ పరంగా ఇతరులను కించే పరచే విధంగా పోస్టులు చేయడం, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేస్తే గ్రూపు అడ్మిన్లదే బాధ్యత అన్నారు. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించి పలువురు అడ్మిన్లకు నోటీసులు ఇచ్చారు.

గడ్డివామి దగ్ధం



కాలిపోతున్న గడ్డివామి

నంద్యాల(అర్బన్): మండలంలోని కానాల గ్రామానికి చెందిన దూదేకుల నడిపి హుసేన్ గడ్డివాము గురువారం దగ్ధమైంది. దాదాపు రూ.2లక్షలు విలువ చేసే గడ్డివామి దగ్ధం కావడంతో బాధిత రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. కొందరు ఆకతాయిల చర్యతో గడ్డివామి నుంచి మంటలు చెలరేగి పక్కనేనున్న శీను ఇంటి ద్వార బంధం కాలిపోయింది. గడ్డివామిని ఆర్పేందుకు నంద్యాల అగ్నిమాపక వాహనాలు లేకపోవడంతో బనగానపల్లె నుంచి వాహనాన్ని రప్పించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

రుసుములు మున్సిపల్ సిబ్బందికి చెల్లించండి

నంద్యాల(సిటీ): మున్సిపల్ పరిధిలో 2024–25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కెట్ గేట్ల వసూళ్లను మున్సిపల్ సిబ్బంది ఈనెల ఒకటో తేదీ నుంచి చేపట్టారని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరానికి సంబంధించిన మార్కెట్ గేట్ల వసూళ్లు మార్చి 31తో ముగిసినందున, మార్కెట్ గేట్లు రుసుములు ఇతరులకు ఇచ్చి మోసపోవద్దని పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పేలిన ఫ్రిజ్



చింతలచెరువులో పేలిన ఫ్రిజ్, కాలిపోయిన సామగ్రి

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు గ్రామంలోని డీలర్ నరసింహారెడ్డి ఇంట్లో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఫ్రిజ్ పేలి ఇంట్లో ఉన్న రూ.22 వేల నగదు, సామగ్రి, 5 బస్తాల బియ్యం తదితర వస్తువులు మంటల్లో కాలి బుడిదయ్యాయి. ప్రమాదంలో సుమారు రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు. ప్రమాదంపై స్థానికులు సమాచారం ఇవ్వడంతో వచ్చి చూస్తే ఇంట్లోని సామగ్రి కాలిపోయిందని చెప్పారు. కాగా ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని తెలిపారు.

తీరనున్న ప్రయాణ కష్టాలు

- రూ.5.92 కోట్లతో మందలూరు రోడ్డు నిర్మాణం
- వేగంగా సాగుతున్న పనులు
- నాడు పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ఆరు గ్రామాల ప్రజలు



మందలూరు వద్ద రోడ్డుపై కంకరను సరిచేస్తున్న కూలీలు



చందలూరు వద్ద యంత్రంతో రోడ్డుకు ఇరువైపులా మట్టిని చదును చేస్తున్న దృశ్యం

రుద్రవరం : మండలంలోని మందలూరు రోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే రోడ్డుపై కంకర తోలించి రోడ్డుపై వేయించారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఎక్స్‌కవేటర్లతో మట్టిని చదును చేయిస్తున్నారు. ట్యాంకర్లతో నీరు తోలించి కంకరపై వేసి రోలర్‌తో తొక్కిస్తున్నారు. పనులు వేగంగా జరుగుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె మెట్ట నుంచి చినేనిపల్లె,చందలూరు, మందలూరు,పి.నాగిరెడ్డిపల్లె,పడకండ్ల మీదుగా ఆళ్లగడ్డ వరకు రోడ్డు సౌకర్యం ఉంది. ఆ రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయమైందని, బాగు చేయించాలని నాటి ప్రజాప్రతినిధులు ప్రజలు కోరారు. వారు కనీసం పిడికెడు మట్టి కూడా వేయలేదు. దీంతో ధ్వంసమైన రహదారిపై రాకపోకలు సాగించలేక జనం అవస్థలు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరులశాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లి ఆ రోడ్డు నిర్మాణానికి రూ.5.92 కోట్లు మంజూరు చేయించి పనులను ప్రారంభింపజేశారు.

ఇబ్బందులు తప్పుతాయి



కొన్నేళ్లుగా మందలూరు రోడ్డు గుంతలమయమై రాకపోకలు సాగించేందుకు వీలులేనట్లుగా మారింది. దీంతో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. సమస్యపై గతంలో టీడీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఇక వర్షాకాలంలో గుంతల్లో నీరు నిల్వ చేరడంతో ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనాల మీద నుంచి కింద పడిన సందర్భాలు కోకొల్లలు. జగనన్న ప్రభుత్వం వచ్చాక రోడ్డుకు మోక్షం వచ్చింది. పనులు కూడా వేగంగా చేస్తున్నారు. రోడ్డు పూర్తయితే ఇబ్బందులు తప్పుతాయి.– శ్రీనివాసరెడ్డి, మందలూరు

సమష్టి కృషితో అధిక మెజార్టీ సాధించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

శిరివెళ్ల: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సమష్టిగా కృషి చేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అధిక మెజార్టీ సాధించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అంతకు ముందు పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో గ్రామస్తులకు 25 పథకాల ద్వారా రూ.43.50 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమయ్యాయన్నారు. అలాగే మరో రూ.15 కోట్ల పరోక్షంగా ప్రజలు లబ్ధిపొందారన్నారు. 223 మందికి పక్కా గృహాలు మంజూరు చేశామని చెప్పారు. మరింత సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే జగనన్న మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. గంగుల విజయసింహారెడ్డి, సర్పంచు అయ్యలూరి సుభహాన్, ఉప సర్పంచు సత్తార్ ప్రతాపరెడ్డి, ఏంపీటీసీ నసీమా, మాజీ మండల ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మేరుగ చిన్ననాగిరెడ్డి, నాయకులు సత్తార్ ప్రభాకరరెడ్డి, సత్తార్ పూలరామిరెడ్డి, పెద్దలాల్, శంకర్, యాపరాల నడిపి గుర్రప్ప, మధు, వంకం వెంకటసుబ్బయ్య, గుత్తి బాలరంగయ్య, చిన్నరంగయ్య, సింగం వెంకటేశ్వరరెడ్డి, తలారి పుల్లయ్య, పురుషోత్తం, దాసరి సురేష్, వెంకట చెన్నుడు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

యర్రగుంట్ల 4వ వార్డుకు చెందిన 20 టీడీపీ కార్యకర్తల కుటుంబాలు గురువారం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. 4వ వార్డుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు దూదేకుల మౌలాలి, ఉయ్యలవాడ శేఖర్, శివయ్య, ఉంగుటూరు శేఖర్, బాలయ్య, నాగేష్, రమణమ్మ, సుమతి, గుర్రమ్మ, దస్తగిరమ్మ, రుద్రమ దేవితో పాటు మరో 8 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.

ఓటు అడిగే అర్హత వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉంది



గొడిగెనూరులో ప్రచారం చేస్తున్న అవంతిక

చాగలమర్రి: ప్రజలకు మంచి చేసిన వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందని వైఎస్సార్‌సీపీ నాయకురాలు గంగుల అవంతిక రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గొడిగెనూరు గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు పత్తి నారాయణ, సర్పంచ్ చీపాటి సంజీవరాయుడుతో కలిసి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 2014 – 2019 వరకు అధికారంలో ఉండి నియోజకవర్గానికి ఏమి చేశారో టీడీపీ నాయకులు ప్రజలకు సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ప్రజలను పట్టించుకోకుండా ఉండి.. ఎన్నికలు రావడంతో జనం గుర్తుకొచ్చారని, ఎన్నడూ లేనిది వారి సమస్యల గురించి ప్రస్తావించడం ఆశ్చర్యకరంగా ఉందని ఎద్దేవా చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీదేవి, ఎంపీపీ వీరభద్రుడు, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషురమేష్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి, వార్డు సభ్యుడు పగిడాల బాబు, మండల నాయకులు మనోహర్‌రెడ్డి, సంజీవ రాయుడు, మనోహర్‌రెడ్డి ఉన్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళకు గాయాలు

రుద్రవరం: మండలంలోని ఆర్.నాగులవరం గ్రామ మలుపు వద్ద గురువారం మోటర్ సైకిల్‌పై నుంచి కింద పడి ప్రసన్న అనే మహిళ గాయ పడింది. పెద్దకంబలూరు పంచాయతీ మజరా గ్రామమైన గోనంపల్లెకు చెందిన ఆమె తండ్రితో కలిసి బైక్‌పై ఆళ్లగడ్డ వైపు వెళ్తుండగా ఆర్.నాగులవరం మలుపు వద్ద అదుపు తప్పి కింద పడింది. గాయ పడిన ఆమెను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అర్హులందరికీ పథకాలు అందాయి



జీనేపల్లెలో ఇంటింటి ప్రచారం చేస్తున్న గంగుల సారికారెడ్డి

శిరివెళ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి సతీమణి గంగుల సారికారెడ్డి అన్నారు. గురువారం జీనేపల్లెలో ఇంటింటి ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ మంచి చేసిన జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకునేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. గ్రామస్తులకు రూ.11.52 కోట్లు పథకాల ద్వారా అందిండన్నారు. మరో రూ.2.86 కోట్ల మేరకు పరోక్షంగా లబ్ధి చేకూరిందని, గ్రామ రోడ్డును రూ.3 కోట్లతో అభివృద్ధి చేశారని వివరించారు. సర్పంచు దగడ రఘునాథరెడ్డి, రమేష్, ఉప సర్పంచు ప్రసాద్, మండల ఉపాధ్యక్షురాలు చీమల అనూష, రాజారెడ్డి, రంగస్వామి, సుబ్బుడు, రాధకృష్ణ, లాయర్ బాబు, కురువ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనం పెంపు



రూపనగుడిలో కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ సాంబశివరావు

ఉయ్యాలవాడ : 2024–25 ఆర్థిక సంవత్సరం నుంచి ఉపాధి హామీ పథకం కూలీల వేతనం రూ.300 అందజేయనున్నారని కోవెలకుంట్ల ఏరియా అసిస్టెంటు ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివరావు తెలిపారు. గురువారం మండలంలోని రూపనగుడి గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న కాలువల్లో పూడిక తీత పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి పనులు జరిగే ప్రదేశాల్లో కూలీలు ఎండ తీవ్రతకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిఆంచారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 2,500 మంది కూలీలు పనులకు రావాల్సి ఉండగా, 20 గ్రామ పంచాయతీ పరిధిలో 1,185 మంది కూలీలు పాల్గొంటున్నారని చెప్పారు. కూలీల సంఖ్య పెంచేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని సూచించారు. ఏపీఓ రవిప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. పోలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, ఇంధన సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెబ్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. నీటి పొదుపు, తదితర అంశాలపై విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ చాటిన వారికి ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. సైన్స్ అధికారి సుందర్‌రావు, కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, నాగేంద్రకుమార్, శీను, రాజు, గోపికృష్ణనాయక్, కరీమ్, విద్యార్థులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన మంచిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

టీడీపీ నాయకులు నంద్యాలకు ఏం చేశారు?

- వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన మంచిని చూడండి
- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి



పెద్దకొట్టాల గ్రామస్తులను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో పట్టణంలో అనేక రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించామని, టీడీపీ హయాంలో నంద్యాలకు ఏం చేశారో చెప్పగలరా అని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని 31వ వార్డు మూలసాగరంలో కౌన్సిలర్ శేకిరెడ్డి అనురాధ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ శేకిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డులోకి ప్రవేశించిన ఆయనకు స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మంచి చేసిన వారిని ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీకి మరోమారు పట్టం కడితే అభివృద్ధిలో నంద్యాలను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని చెప్పారు. తమ హయాంలో 31వ వార్డుకు రూ.21 కోట్లతో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సంక్షేమాభివృద్ధి జరిగిందని వివరించారు. అలాగే రూ.2.5 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేశామన్నారు. మూలసాగరం ప్రాంతానికి అతి దగ్గరలో రూ.100 కోట్లతో అధునాతన కలెక్టరేట్, నర్సింగ్ కళాశాలను నిర్మిస్తామన్నారు. నంద్యాల పార్లమెంట్ అభ్యర్థిగా పోచా బ్రహ్మానందరెడ్డిని, ఎమ్మెల్యేగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, రాష్ట్ర ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళరెడ్డి, మాజీ చైర్‌పర్సన్ దేశం సులోచన, వైస్ చైర్మన్లు పాంషావలి, గంగిశెట్టిశ్రీధర్, జేసీఎస్ కన్వీనర్ దాల్‌మిల్ అమీర్, మాజీ కౌన్సిలర్లు వెంకటసుబ్బయ్య గౌడ్, పుల్లమ్మ, వెంగల్‌రెడ్డి, 2వ పట్టణ అధ్యక్షుడు, పున్నాశేషయ్య, అడ్వకేట్ రామసుబ్బయ్య, కౌన్సిలర్లు, నాయకులు తిమ్మారెడ్డి, ప్రసాద్, శ్రీను, బషీర్, రఫీ, నూర్‌ఖాన్, పరమేశ్వరరెడ్డి, మాధవ, బీబీ పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందాం

నంద్యాల(అర్బన్): అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలకు మంచి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పెద్దకొట్టాల గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మూడేళ్లలోనే గ్రామంలో దాదాపు రూ.1.75 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని చెప్పారు. నాయకులు శీలం శివనాగిరెడ్డి, రవికుమార్‌రెడ్డి, శివారెడ్డి, రాయపురెడ్డి, శంకర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరాముడు, నంది నాగేశ్వరరావు, బోరెడ్డి సర్వేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీపీ ప్రభాకర్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, బసవేశ్వర రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



6వ వార్డు సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి మంజులకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

నంద్యాల(సిటీ): పట్టణంలో ప్రజలకు సేవ చేస్తుంటే తమపై రాజకీయ పార్టీలు నిందలు వేస్తున్నాయని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 6వ వార్డు జగజ్జననీ నగర్‌కు చెందిన 29 మంది వలంటీర్లు గురువారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను స్థానిక సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి మంజులకు అందజేశారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్, బీజేపీ తీరుపై మనస్థాపానికి గురయ్యామన్నారు.

జూలేపల్లెలో 14 మంది..

గోస్పాడు: మండలంలోని జూలేపల్లె గ్రామ వలంటీర్లు 14 మంది గురువారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగఅనసూయకు రాజీనామా పత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగులుగా తమకు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించారన్నారు. అయితే ప్రతిపక్షాలు తమను కించపరిచేలా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారని, అందుకే రాజీనామాలు చేశామని తెలిపారు. ఇక నుంచి తాము వైఎస్సార్‌సీపీ గెలుపునకు స్వచ్ఛందంగా కృషి చేస్తామని తెలిపారు.

శిరివెళ్ల: మండలంలో ముగ్గురు గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీఓ ఫణిరాజకుమారి బుధవారం తెలిపారు. మండల కేంద్రం శిరివెళ్లలో ఇద్దరు, యర్రగుంట్లలో ఒకరు స్వచ్ఛందంగా రాజీనామా చేశారన్నారు. వారి రాజీనామా పత్రాల ఆమోదం కోసం డీఎల్‌డీఓ ద్వారా కలెక్టర్‌కు పంపామని చెప్పారు.

పండుటాకుల పాట్లు

- సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ
- కార్యాలయాల వద్దకు రావడానికి వృద్ధుల అష్టకష్టాలు
- మజరా గ్రామాల లబ్ధిదారుల అవస్థలు వర్ణనాతీతం



ఇంజేడులో పింఛన్ కోసం మండుటెండలో సచివాలయానికి వస్తున్న పింఛన్‌దారులు

ఉయ్యాలవాడ : పింఛన్ల కోసం రెండవ రోజు గురువారం కూడా పండుటాకులు పడరాని పాట్లు పడ్డారు. మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీల్లో పింఛన్ల పంపిణీ సచివాలయ ఉద్యోగులు చేపట్టారు. వృద్ధులు, మహిళలు, నడవలేని వారు ఎండతీవ్రతకు నరకయాతన అనుభవించారు. నడవడానికి చేతకాని వృద్ధులు, కుమారుడు, ఇతరుల సహాయంతో ద్విచక్ర వాహనాల్లో సచివాలయాల వద్దకు వెళ్లారు. ఈ ఐదేళ్లలో ఎలాంటి కష్టం లేకుండా వాలంటీర్లే ఇంటి వద్దకు వచ్చి పింఛన్ సొమ్ము చేతిలో పెడుతుండడంతో సంతోషంగా తీసుకునే వాళ్లమని పేర్కొంటున్నారు. వాలంటరీ వ్యవస్థ బాగా పని చేయడంతో ప్రజల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆదరణ పెరుగుతుండడంతో తమ ఉనికికే ప్రమాదమని భావించి చంద్రబాబు పింఛన్ల పంపిణీ అడ్డుకున్నారని అవ్వ, తాతలు శాపనార్థనాలు పెడుతున్నారు. మళ్లీ ఈయన అధికారంలోకి వస్తే మాకు కష్టాలు తప్పవని మేము జగన్ ప్రభుత్వానికి మద్దతుగా వుంటామని అవ్వతాతలు పేర్కొంటున్నారు.

గోస్పాడు: మండలంలోని సచివాలయాల్లో 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ నాగఅనసూయ గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 12 సచివాలయాల పరిధిలో 5,364 పింఛన్లు ఉండగా 4,828 మందికి సొమ్ము అందజేశామని చెప్పారు. ముందస్తుగా దివ్యాంగులు, ఇంటి నుంచి రాలేని వారికి సొమ్ము అందజేశామన్నారు.



గోస్పాడులో పింఛన్ పంపిణీ చేస్తున్న అధికారులు

రెండో రోజూ తిప్పలే..

రుద్రవరం: మండలంలోని పింఛన్‌దారులకు రెండో రోజు తిప్పలు తప్పలేదు. ఉదయం నుంచే పింఛన్‌దారులు ఆయా గ్రామాల్లోని సచివాలయాల వద్దకు చేరుకున్నారు. అయితే అప్పటికే సచివాలయాల వద్ద ప్రభుత్వ అధికారులు షామియానాలు వేసి నీడ వసతి కల్పించి ఉండటంతో వచ్చిన వారంతా అక్కడ కూర్చొన్నారు. ఉద్యోగులు విధులకు రాగానే పింఛన్ పంపిణీ చేపట్టారు. అయితే మజరా గ్రామాల లబ్ధిదారుల అవస్థలు అంతా ఇంతా కాదు. సచివాలయాల వద్దకు చేరుకునేందుకు వాహన సౌకర్యం లేకపోవడంతో నడిచి వెళ్లాల్సివస్తోంది. కోటకొండ సచివాలయానికి మజరా అయిన కే.కొత్తూరు వాసులు పొలాల గట్ల మీదుగా చేరుకున్నారు. వారు మాట్లాడుతూ వలంటీర్లు ఉండి ఉంటే తమకు ఈ కష్టాలు వచ్చేవి కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

నంద్యాల(అర్బన్): నడవలేని వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం మండల గ్రామాల సచివాలయ సిబ్బంది వృద్ధుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల పంపిణీ చేపట్టారు. రెండవ రోజు పింఛన్ల కోసం సచివాలయాల వద్దకు వచ్చి వృద్ధులు, వితంతువులు ఎదురు చూశారు. మొత్తం 80 శాతం పింఛన్లు పంపిణీ పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.



కే.కొత్తూరు నుంచి కోటకొండకు పొలం గట్లపై వెళ్తున్న పింఛన్‌దారులు



కోటకొండలో సచివాలయం వద్ద నిరీక్షణ



చాగలమర్రి చిన్నమకానం వీధిలో ఒంటరిగా ఉంటున్న జానకమ్మ

చాగలమర్రి: స్థానిక 1వ సచివాలయ పరిధిలోని చిన్నమకానం వీధిలో నివాసం ఉంటున్న కమలాపూరి జానకమ్మ అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తూ 16 ఏళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందింది. ఆమెకు కూతురు సుబ్బలక్ష్మీ, కుమారుడు ఉన్నారు. అయితే కుమారుడు ఉద్యోగ రీత్యా సుదూర ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. పుట్టుకతోనే అంధురాలైన కూతురు సుబ్బలక్ష్మీ, తల్లి జానకమ్మ ఇక్కడే నివాసం ఉంటున్నారు. జానకమ్మకు వయస్సు మీద పడటంతో మంచానికే పరిమితమైంది. దీంతో అంధురాలైన కుమార్తె ఆలనా, పాలన చూడలేకపోతోంది. ఇంటి పక్కనే నివాసం ఉంటున్న లక్ష్మీ దంపతులు..సుబ్బలక్ష్మికి వస్తున్న దివ్యాంగ పెన్షన్ తీసుకొని వారి ఇంట్లోనే ఉంచుకొని బాగోగులు చూస్తున్నారు. జానకమ్మకు సాయి సుదర్శన్‌రావు పింఛన్ మొత్తంలో కొంత తీసుకొని భోజన సదుపాయం కల్పిస్తున్నాడు. ఈ నెల పింఛన్ సొమ్ము అందక పోవడంతో ఆందోళన చెందుతున్నారు.



పింఛన్ కోసం కేపీ తండా నుంచి శెట్టివీడు సచివాలయానికి వచ్చిన గిరిజన వృద్ధులు



చాగలమర్రిలో అంధురాలు సుబ్బలక్ష్మి